
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం, 16, అక్టోబర్, 2024



9,711 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 9,711 క్యూసెక్కుల వరద చేరుతోంది. జలాశయంలో 52.23 టీఎంసీలు ఉన్నాయి. డెల్టాకు 50, ఉత్తరకాలువకు 40, దక్షిణకాలువకు 6 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.78,280
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ.7,114
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,327
నవర (8 గ్రాములు)	రూ.58,616

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.5 /24.5

జిల్లాలో బుధవారం కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం, మరికొన్ని చోట్ల అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. మంగళవారం గాలిలో తేమ 95 శాతం ఉంది.

న్యూస్‌రీల్

నేడు కళాశాలలు, పాఠశాలలకు సెలవు

నెల్లూరు (టౌన్): బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం ప్రభావంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బుధవారం జిల్లాలోని జూనియర్ కళాశాలలు, పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈఓ పీవీజే రామారావు, ఆర్ఐఓ శ్రీనివాసులు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పాఠశాలలను మూసివేయాలన్నారు. డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు అన్ని పాఠశాలలకు సమాచారం అందించాలన్నారు.

అధైర్య పడొద్దు అండగా నిలుస్తాం

- వర్ష బాధితుల సేవకు పార్టీ శ్రేణులు సిద్ధం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



జగనన్న కాలనీలో పర్యటిస్తున్న కాకాణి

వెంకటాచలం: భారీ వర్షాలకు జిల్లా ప్రజలు ఎవరూ అధైర్య పడొద్దని.. ఏ అవసరం వచ్చినా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అండగా నిలుస్తారని మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వాయుగుండం ప్రభావంగా రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మంగళవారం వెంకటాచలంలోని జగనన్న కాలనీలో ఆయన పర్యటించారు. స్థానిక కాలనీ వాసులతో మాట్లాడారు. జగనన్న పుణ్యంతో సొంత ఇంటి కల నెరవేరిందని తామంతా సంతోషంగా ఉన్నామని కాలనీ వాసులు పేర్కొన్నారు. కాకాణి మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన సేవలు అందించడానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లాలో విపత్తు సమయంలో అధికారులు, అధికార పార్టీ నాయకులు పరిపాలనను గాలికి వదిలేసి మద్యం షాపులు కేటాయింపులు, వాటాల వ్యవహారాల్లో బిజీబిజీగా ఉండడం దౌర్భాగ్యమని మండిపడ్డారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, జెడ్పీటీసీ పోట్లూరు సుబ్రహ్మణ్యం, నాయకులు మందల పెంచలయ్య, షాబాషా, ఉప్పు అశోక్, గోపాల్ పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఎన్‌ఎండీ ఫరూక్

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను నియమించింది. జిల్లాకు చెందిన దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ప్రకాశం జిల్లాకు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కాకినాడ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రులుగా నియమించింది.

కప్పం కట్టు.. షాపు పెట్టు

- మద్యం దుకాణాలకు 'పచ్చ' నేతల ట్యాక్స్ భూతం
- టీడీపీ సిండికేట్‌కే దక్కిన తొంభై ఐదు శాతం షాపులు
- సిండికేట్‌లో వారైతే 20, ఇతరులైతే 40 శాతం వాటా డిమాండ్
- సర్వేపల్లిలో ముందస్తు ఒప్పందంతోనే 20 శాతం వాటా ఫిక్స్



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో బుధవారం నుంచి 182 ప్రైవేట్ మద్యం షాపులు తెరుచుకోనున్నాయి. ఎల్లో సిండికేట్ల మాఫియా చెలరేగిపోతోంది. కప్పం కడితేనే.. దుకాణం పెట్టుకునేందుకు అనుమతి స్తామంటూ తెగేసి చెబుతున్నారు. స్థానిక లీడర్ల నుంచి ఎమ్మెల్యేల వరకు వాటాలు ఇచ్చుకుంటేనే వ్యాపారం చేసుకునే వీలు ఉంటుంది. సిండికేట్లోని వ్యాపారులైతే 20 శాతం, ఇతరులైతే 40 శాతం వాటాలు ఇవ్వాల్సిందే అంటూ డిమాండ్ చేస్తున్నారు. కోవూరులో నియోజకవర్గంలో అయితే ఎవరైనా సరే 40 శాతం వాటా ఇవ్వాలని.. ఇదే స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలంటూ ఇటీవల టీడీపీ నేతలు తీర్మానం చేశారు. సర్వేపల్లిలో అయితే ముందస్తుగానే 20 శాతం వాటాకు ఒప్పందం చేసుకోవడంతో అక్కడ అదే ఫిక్స్ అయింది. మిగతా నియోజకవర్గాల్లో 25 నుంచి 30 శాతం వాటాలకు స్థానిక ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. మండల స్థాయిలో ముఖ్య నేతలకు వాటాల వసూలు బాధ్యతలు అప్పగించారు. ప్రతి దుకాణం ఎమ్మెల్యేల వాటాలతో పాటు పచ్చ నేతల ట్యాక్స్‌లు చెల్లించుకోవాల్సిన పరిస్థితి అనివార్యం కానుంది. కావలి, కందుకూరు నియోజకవర్గాల్లో మాత్రం స్థానిక ఎమ్మెల్యేలు దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులను పిలిపించి అందరు సిండికేట్‌తో కలిసి వ్యాపారం చేసుకోవాలని ఆదేశించారు. దీంతో సిండికేట్‌లో లేని వారికి వాటాల భయం పట్టుకోవడంతో షాపులను గుడ్ విల్ కింద ఇచ్చేసి వెళ్లిపోతున్నారు. నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో కూడా సిండికేట్‌లో లేని వారిపై రాజకీయ ఒత్తిళ్లు పెంచి 20 శాతం వాటా ఇవ్వాల్సిందేనని హెచ్చరికలు పంపించారు.

మద్యం దుకాణం ఎవరు నడిపినా.. వాటాలు మాత్రం మాకు ఇవ్వాల్సిందే అంటున్నారు. 'ప్రైవేట్' ముసుగులో దుకాణాలన్నీ హైజాక్ చేసిన ఎల్లో సిండికేట్లు వాటాల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. మద్యం దరఖాస్తుల ప్రక్రియలో స్థానిక ఎమ్మెల్యేల నేతృత్వంలో పచ్చ నేతలు సిండికేట్‌గా ఏర్పడి పారదర్శకత, లాటరీ ప్రక్రియలను కనికట్టుగా మార్చేసి షాపులు దక్కించుకున్నారు. అక్కడక్కడ ఇతరులు చేజిక్కించుకున్న షాపుల యజమానులపై ఎల్లో సిండికేట్లు వాటాల కోసం రాజకీయంగా ఒత్తిళ్లు పెంచుతున్నారు. ఎమ్మెల్యేలు స్థానిక లీడర్లను సామంతులుగా పెట్టుకుని పచ్చ ట్యాక్స్ వసూళ్లకు సిద్ధపడుతున్నారు.

బిజినెస్ పాయింట్‌కు అదనపు కప్పం

గతంలో మద్యం షాపు నిర్వహించే ప్రాంతం పేరుతో టెండర్లు దక్కించుకుంటే.. అక్కడే నిర్వహించే వారు. ఈ దఫా ప్రత్యేకించి ఎక్కడ షాపు అనేది స్పష్టత లేకుండా కేటాయించారు. షాపులు దక్కించుకున్న వ్యాపారులు ఎక్కడ మద్యం వ్యాపారం జోరుగా జరుగుతుందో అక్కడ ఏర్పాటు చేసుకోవాలంటే అదనపు కప్పం కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో మద్యం వ్యాపారం జరిగే ప్రాంతాలను స్థానిక ప్రజాప్రతినిధులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో తమ సిండికేట్‌లో ఉన్న వారికి షాపు కేటాయిస్తున్నారు. ఒక వేళ సిండికేట్‌లో లేని వారు వ్యాపారం జరిగే ప్రాంతాన్ని ఎంచుకుంటే వేలం నిర్వహించి కప్పం కట్టాల్సి వస్తోంది. ఈ తరహా విధానం నెల్లూరులో పాటు సర్వేపల్లి, కావలి, కందుకూరు నియోజకవర్గాల్లో జరుగుతున్నట్లు తెలుస్తోంది.

సర్వేపల్లిలో 90 శాతం షాపులు ఎల్లో సిండికేట్లవే..

నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 90 శాతం షాపులు టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులకే దక్కాయి. స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనయుడు షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తూ షాపు దక్కించుకున్న ప్రతి ఒక్కరూ 20 శాతం వాటా ఇవ్వాల్సిందే అనే ఒప్పందంతో దరఖాస్తులు వేయించారు. పొదలకూరు మండలంలో మొత్తం 6 షాపులు టీడీపీలో క్రియాశీలంగా వ్యవహరిస్తున్న వారికే దక్కాయి. టీపీగూడూరులో ఇతరులకు ఒక షాపు దక్కడంతో టీడీపీ నేతల బెదిరింపులతో ఆ షాపును నెల్లూరురూరల్ పరిధిలోని ఓ టీడీపీ నేతకు గుడ్ విల్ కింద విక్రయించేశాడు. ముందస్తు ప్రణాళికతో ఎమ్మెల్యే సోమిరెడ్డి టీడీపీ వారితోనే దరఖాస్తులు వేయించారు. పొదలకూరు మండలానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు రావుల దశరథరామయ్యగౌడ్ దరఖాస్తు దాఖలు చేసినా షాపు లభించలేదు. టీడీపీ నేతలు ఒక్కొక్క షాపునకు సిండికేట్‌గా మారి దరఖాస్తులు వేయడంతో వారికే లభించినట్టుగా తెలుస్తోంది. ఒక్కొక్క షాపునకు ఐదు నుంచి పది మందిపైగా భాగస్తులు ఉన్నారు.

కందుకూరులో 98 శాతం

కందుకూరు నియోజకవర్గంలో మద్యం వ్యాపారులు అంతా సిండికేటయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధికి వాటా ఇచ్చేలా.. ఎవరికి షాప్ వచ్చినా అందరూ పంచుకునేలా ప్లాన్ చేశారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 17 మద్యం షాపులు ఉండగా 98 శాతం సిండికేట్లకే దక్కాయి. వీరు లాటరీకి ముందే ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో ఒప్పందం చేసుకున్నారు. ఆ ప్రకారమే వారు సిండికేట్‌గా మారి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. కొందరు మాత్రం స్వతంత్రంగా వేశారు. వారిలో ఒకరికి మాత్రమే లాటరీ తగిలింది. ఆ షాపులో వాటా కోసం ఒత్తిడి పెంచారు. 30 ఏళ్లుగా మద్యం వ్యాపారంలో ఉన్న వ్యాపారస్తులు ఈ సిండికేట్‌లో కీలక పాత్ర పోషించారు.

జలాశయం అధికారుల అలెర్ట్

సోమశిల: వాయుగుండం ప్రభావంగా కురుస్తున్న వర్షాలకు సోమశిల ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం వస్తున్న నేపథ్యంలో మంగళవారం ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి జలాశయాన్ని పరిశీలించారు. జలాశయం గేట్లను, కంట్రోల్ రూమ్‌లను పరిశీలించి అక్కడ ఉన్న సిబ్బందిని అప్రమత్తం చేశారు. అధికారులకు డ్యామ్ వద్ద అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట డీఈ రవీంద్రప్రసాద్, ఏఈఈ దశరథరామిరెడ్డి, జేఈఈలు రామ్మోహన్‌రెడ్డి, నిఖిల్ ఉన్నారు.



జలాశయాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఈ

వాన గండం

- 11 మండలాల్లో 100 మి.మీ.లకు పైగా వర్షం
- అత్యధికంగా జలదంకిలో 177.6 మి.మీ. వర్షపాతం నమోదు
- మూడు రోజులుగా విద్యాసంస్థలకు సెలవులు
- 48 గంటలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచన



కృష్ణపట్నం తీరంలో ఎగసిపడుతున్న అలలు

నెల్లూరు (దర్గామిట్ట): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వాయుగుండం ప్రభావం చూపిస్తోంది. సోమవారం తెల్లవారుజాము నుంచి రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అత్యధికంగా జలదంకి మండలంలో 177.6, విడవలూరులో 168.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో భారీ వర్షాలతో బుధవారం కూడా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారడంతో మరో వైపు ఎగిసిపడుతున్న అలలతో కడలి తీరం కల్లోలంగా మారింది. తీర ప్రాంతంలోని ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, అధికారులు చెప్పే సూచనలు పాటించాలని కలెక్టర్ సూచించారు. రేకుల షెడ్లు, పూరిళ్లలో నివసించే ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలన్నారు. రాబోయే రెండు, మూడు రోజు లు మరింత జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక బృందాలు జిల్లాకు రప్పిస్తున్నట్లు తెలిపారు.

48 గంటలు అప్రమత్తం : కలెక్టర్ ఆనంద్

జిల్లా ప్రజలు మరో 48 నుంచి 72 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ గడిచిన 24 గంటల్లో 80 మి.మీ.ల వర్షపాతం నమోదైతే.. 11 మండలాల్లో 100 మి.మీ. పైగా వర్షపాతం నమోదు అయిందన్నారు. భారీ వర్షాలకు ఇప్పటి వరకు ఎక్కడా కూడా ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని చెప్పారు. మరో 48 గంటల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. అధికారులందరూ కూడా పనిచేసే చోటే ఉండాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను తరలించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కావలి, ఆత్మకూరు, సంగం మండలాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అక్కడ ఆహారం, తాగునీరు, పాలు అన్ని రకాల సౌకర్యాలు అందించడానికి చర్యలు చేపట్టామన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో ఇన్‌ఫ్లోపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నామన్నారు. సోమశిలలో ఇంకా 21 టీఎంసీలు నిల్వ చేసేందుకు అవకాశం ఉందన్నారు. అయితే ప్రస్తుతం వచ్చే ఇన్‌ఫ్లోకు అదనంగా 2 వేల క్యూసెక్కులు మాత్రమే వస్తుండడంతో ఎలాంటి ప్రమాదం లేదని, అయినప్పటికి అక్కడి వారిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. పంట నష్ట వివరాలను ఆ శాఖ అధికారుల ద్వారా తెలుసుకుంటామని, వాటి వివరాలను వెల్లడిస్తామని తెలిపారు. సముద్రంలో మత్స్యకారులందరూ సురక్షితంగా వచ్చేశారని, అయినప్పటికి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఎల్లో మాఫియా మాయ

- మూడు రీచ్‌లకు ఒక్క టెండర్ రాకపోవడం గమనార్హం
- నేటితో ముగియనున్న గడువు
- ఇప్పటికే డ్రెడ్జింగ్ పేరుతో దోపిడీ చేస్తున్న ఎమ్మెల్యేలు, షాడోలు

నెల్లూరు (సెంట్రల్): జిల్లాలో ఎల్లో మాఫియా కనుసన్నల్లో ఇసుక వ్యాపారం మూడు రీచ్‌లు.. ఆరు డంపింగ్ యార్డుల్లా సాగుతోంది. జిల్లాలో బంగారం కంటే ఇసుక దొరకని పరిస్థితి నెలకొంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు జిల్లాలో సుమారు 8 లక్షల యూనిట్ల ఇసుకను అప్పటి ప్రభుత్వం ఎనిమిది ప్రాంతాల్లో నిల్వ చేసింది. కౌంటింగ్ జరిగిన రాత్రి నుంచే ఇసుక దోపిడీకి తెరతీసిన ఎమ్మెల్యేలు, పచ్చ నేతలు ప్రభుత్వ పాలసీ ప్రకటించే నాటికి మూడు యార్డుల్లో 3 లక్షల యూనిట్లు మిగిల్చారు. ఇందులోనూ అధికారికంగా కొంత.. అనధికంగా కొంత దోచుకున్నారు. ఇది కాకుండా పెన్నానదిలో అడుగడుగున అనధికార రీచ్‌లతో దోపిడీని కొనసాగిస్తున్నారు. ఇదంతా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోంది. స్థానికంగా మాత్రం దొరకడం లేదు. అధికారంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతిలేకపోవడంతో ఇసుక తవ్వకాలను నిలిపివేసింది. యార్డుల్లో ఇసుక నిల్వలు అయిపోవడంతో పెన్నానదిలో పూడికతీత పేరుతో ఇసుక దోపిడీకి తెరతీశారు. అధికారికంగా మూడు చోట్ల ఇసుక డ్రెడ్జింగ్ పేరుతో టెండర్లు పిలిచి ఎమ్మెల్యేలు, షాడో ఎమ్మెల్యేలు ఇసుక దోపిడీ చేస్తున్నారు. ఇసుక బయటకు తీసుకురావడానికి రూ.కోట్ల ఖర్చు పెట్టి రోడ్లు వేశారు. పచ్చనేతల ఇసుక మాఫియాపై మీడియాల్లో కథనాలు రావడంతో ఎస్‌జీటీ అనుమతులు లేకపోయినా.. కలెక్టర్ ఇతోధిక అధికారాలతో జిల్లాలో పల్లిపాడు, మినగల్లు, పడమటి కంభంపాడు ప్రాంతాల్లో యంత్ర రహిత ఇసుక తవ్వకాలకు ఈ నెల 6వ తేదీన టెండర్లు పిలిచారు. బుధవారంతో ఈ గడువు పూర్తి కానుంది. అయితే ఇప్పటి వరకు ఒక్క టెండర్ కూడా నమోదు కాకపోవడం గమనార్హం. ఇసుక టెండర్లు వేస్తే.. డ్రెడ్జింగ్ కాంట్రాక్ట్ రద్దు అవుతుంది. ఇప్పటికే జిల్లాలో టీడీపీ నేతలు మాఫియాగా తయారై.. ఏ వ్యాపారం చేయాలన్నా.. ఏ టెండర్ వేయాలన్నా.. వీరి అనుమతి తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే మద్యం వ్యాపారాన్ని సైతం టీడీపీ సిండికేట్ మొత్తం షాపులను హైజాక్ చేసింది. ఇసుక తవ్వకాల విషయంలో ఎవరూ టెండర్లు వేయడానికి వీల్లేదనే హెచ్చరికలతో ఒక్క టెండర్ కూడా పడలేదని, ఇదంతా ఎల్లో మాఫియా మాయ అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేటితో గడువు ముగుస్తుండడంతో టెండర్‌లు మళ్లీ పిలుస్తారా లేక సిండికేట్లకే మొగ్గు చూపుతారా? అనేది వేచి చూడాల్సి ఉంది.

క్లుప్తంగా

హుండీ కానుకల లెక్కింపు



సంగం: సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. కానుకల రూపంలో రూ.1,37,734 మేర భక్తులు సమర్పించారు. ఈఓ చైతన్య, ప్రధానార్చకుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని చుక్కలదుప్పి మృతి



వెంకటాచలం: రోడ్డు దాటుతున్న చుక్కల దుప్పిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన ఘటన మండలంలోని సరస్వతీనగర్ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. ఉదయం 10 గంటల సమయంలో సరస్వతీనగర్ సమీపంలో చుక్కల దుప్పి రోడ్డు దాటుతుండగా, గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో చుక్కల దుప్పి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయమై పోలీసులు, అటవీశాఖ అధికారులకు ప్రయాణికులు సమాచారమిచ్చారు. అటవీశాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని పరిశీలించారు. మృతి చెందిన చుక్కల దుప్పిని అడవిలోకి తీసుకెళ్లి దహనం చేశారు.

నేతలతో బుర్రా భేటీ



కందుకూరు: నియోజకవర్గంలోని పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలతో పార్టీ కందుకూరు సమన్వయకర్త బుర్రా మధుసూదన్‌యాదవ్ స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. నియోజకవర్గంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అధికార పార్టీ నేతలు సాగిస్తున్న అరాచకాలను పలువురు తెలియజేశారు. చట్ట ప్రకారం అన్ని సమస్యలపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ సూచనలకు అనుగుణంగా పనిచేద్దామని, అన్ని సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

కలువాయి మత్స్యకార సంఘం రద్దు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని కలువాయి మత్స్యకార సహకార సంఘ పాలకవర్గాన్ని రద్దు చేశామని మత్స్యశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోఆపరేటివ్ చట్టం మేరకు కలువాయి మత్స్యకార సంఘాన్ని 2022లో ఏర్పాటు చేశారని, అయితే కొందరు సభ్యులు తమ కార్యకలాపాలను సక్రమంగా నిర్వర్తించడంలేదనే ఫిర్యాదులొచ్చాయని చెప్పారు. ఇదే అంశమై కలెక్టర్‌కు సైతం ఇటీవల ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. విచారణ నిమిత్తం ప్రత్యేకాధికారిని నియమించామని, పాలకవర్గానికి సంబంధించిన రికార్డులను ఇవ్వాలని కోరినా, కొన్నింటినే ఇచ్చారని చెప్పారు. హైకోర్టు ఆదేశించినా, పెడచెవిన పెట్టారని, అన్ని పరిశీలించిన అనంతరం కలువాయి మత్స్యకార సహకార సంఘ పాలకవర్గాన్ని రద్దు చేశామని తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సంజయ్ స్టీఫెన్‌ను ప్రత్యేకాధికారిగా నియమించామని, ఆయన ఆదేశాల మేరకు కలువాయి సంఘ కార్యకలాపాలు జరగనున్నాయని పేర్కొన్నారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

కావలి: పట్టణంలోని పాతూరులో గల అక్కమ్మ బావిలో కోరా శ్రీకాంత్ (30) అనే వ్యక్తి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా భావిస్తున్నామని కావలి వన్ టౌన్ సీఐ ఫిరోజ్ మంగళవారం చెప్పారు. మున్సిపాల్టీకి చెందిన తాగునీటిని సరఫరా చేసే బావిలో వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారమివ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ బావి వద్దకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసేందుకు పోలీసులకు సహకరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలోని వెంగాయగారిపాళేనికి చెందిన మృతుడు వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్తున్నారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. బావి నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.60
సన్నవి : రూ.30
పండ్లు : రూ.20

హామీ ఇచ్చి.. ఊసెత్తరే!

- అధికారంలోకి రాగానే ఇంటర్ విద్యార్థులకు మిడ్ డే మీల్స్
- యువగళంలో నారా లోకేష్ హామీ
- కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు దాటినా..
- మధ్యాహ్న భోజన ప్రస్తావనను విస్మరించిన టీడీపీ ప్రభుత్వం



కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల

నెల్లూరు (టౌన్): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి విద్యార్థుల ఆకలి తీరుస్తామని ఇప్పటి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం సభలో హామీ ఇచ్చారు. నాణ్యమైన భోజనాన్ని అందించి విద్యార్థులకు క్యారేజీల బరువు తగ్గిస్తామని చెప్పారు. కళాశాలలు ప్రారంభమై ఐదు నెలలు కావొస్తోంది. టీడీపీ అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటింది. అయినా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకంపై ఎవరూ నోరు విప్పడం లేదు.

20 వేల మందికిపైగా విద్యార్థులు

జిల్లాలో మొత్తం 26 ప్రభుత్వ, రెండు ఎయిడెడ్ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిల్లో 20 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరందరూ రోజూ గ్రామీణ ప్రాంతాల నుంచి జూనియర్ కళాశాలలకు వస్తున్న పరిస్థితి ఉంది.

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు **28**
విద్యార్థులు **20** వేల మందికి పైగా

కళాశాలకు వచ్చే సమయంలోనే ఇంటి దగ్గరుంచి క్యారేజీ తెచ్చుకునేందుకు ఒక్కోసారి సమయం కూడా ఉండదు. దీంతో మధ్యాహ్న భోజనం కోసం హోటళ్లకు వెళ్లడం ఖర్చుతో కూడుకున్న పని. నాణ్యమైన భోజనం అందకుంటే ఆరోగ్యం సైతం క్షీణించే పరిస్థితి ఉంటుంది. పాఠశాలల తరహాలోనే మధ్యాహ్న భోజనాన్ని కళాశాలల్లోనూ అమలు చేయాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తామని యువగళం సభలో నారా లోకేష్ హామీ ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు దాటింది. అటు మంత్రి గానీ, ఇటు పాలకులు గానీ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఊసెత్తడం లేదు. అధికారంలోకి వచ్చేందుకు ఉత్తుత్తి హామీలివ్వడంపై పలువురు మండి పడుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే అందరూ పేద విద్యార్థులు కాబట్టి వారిపై భారం పడకుండా మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

హామీని నెరవేర్చాలి



ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలి. యువగళంలో నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు మధ్యాహ్న సమయంలో భోజనానికి ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలలు ప్రారంభమై ఐదు నెలలు కావస్తున్నా నేటికీ మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయకపోవడం దారుణం. పథకాన్ని అమలు చేయకపోతే విద్యార్థి సంఘాలను కలుపుకొని జేఏసీగా ఏర్పడి ఉద్యమానికి శ్రీకారం చుడతాం.

– సాయి ఆదిత్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ విద్యార్థి జేఏసీ

విద్యార్థులకు భోజనం అందించాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే వారిలో ఎక్కువ మంది పేద విద్యార్థులు. కళాశాలకు వచ్చిన సమయంలో భోజనానికి ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. కొంతమంది క్యారేజీలు కూడా తెచ్చుకునే పరిస్థితి ఉండదు. ఇలాంటి వారంతా చదువుపై దృష్టి సారించే పరిస్థితి ఉండదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని లోకేష్ నిలబెట్టుకోవాలి.

– మస్తాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్

రూ.10 నాణేలు చెల్లుతాయి

- కెనరా బ్యాంక్ డీజీఎం జీఎన్ మూర్తి



రూ.10 నాణేలను బ్యాంక్ సిబ్బందికి అందిస్తున్న ఉన్నతాధికారులు

నెల్లూరు(సెంట్రల్): చట్టపరంగా రూ.10 నాణేలు చెల్లుబాటవుతాయని కెనరా బ్యాంక్ సర్కిల్ డిప్యూటీ మేనేజర్ జీఎన్ మూర్తి పేర్కొన్నారు. నెల్లూరులోని కెనరా బ్యాంక్ రీజినల్ కార్యాలయంలో పది రూపాయల నాణేలపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రూ.10 నాణేలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. 52 బ్యాంక్ శాఖల ద్వారా రూ.10 నాణేలను ప్రజలకు అందించేలా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. మొబైల్ కరెన్సీ వ్యాన్‌ను ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యాలయ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నాగరాజు, తిరుపతి సర్కిల్ జనరల్ మేనేజర్ మూర్తి, డివిజనల్ మేనేజర్ మునిశేఖర్, మేనేజర్ స్మృతి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం

- ఉల్లాస్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలి
- అధికారులకు కలెక్టర్ ఆనంద్ హితవు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): అక్షరాస్యతతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించి జిల్లా స్థాయి అధికారులతో కన్వర్జెన్సీ సమావేశాన్ని కలెక్టరేట్లోని తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు చెందిన 19,178 మంది నిరక్షరాస్యులను అభ్యాసకులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. 15 ఏళ్ల పైబడి ఉన్న నిరక్షరాస్యులు, గతంలో మధ్యలో బడి మానేసిన వారు ఈ కార్యక్రమం ద్వారా చదువు నేర్చుకోవచ్చని వివరించారు. కార్యక్రమాన్ని ఆర్నెల్ల పాటు నిర్వహించనున్నామని వెల్లడించారు. డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, డీఈఓ రామారావు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సదారావు తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య మద్యం షాపు వద్దు



సీఐకి వినతిపత్రమిస్తున్న స్థానికులు

ఉదయగిరి: ఉదయగిరి అన్నపూర్ణ నగర్‌లో జనావాసాల మధ్య నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. ఆ ప్రాంతంలో మద్యం టెండర్ దక్కించుకున్న వ్యక్తితో పాటు ఎక్సైజ్ అధికారులు మంగళవారం స్థల పరిశీలనకు రావడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో షాపును ఏర్పాటు చేస్తే సహించమని చెప్పారు. అధికారులు నచ్చజెప్పేందుకు యత్నించినా, స్థానికులు ససేమిరా అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో గండిపాళెం రోడ్డులో షాపును ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం ఊరికి దూరంగా ఉండటంతో గత ఐదేళ్లు ఎలాంటి సమస్య తలెత్తలేదు. అయితే మద్యం ప్రైవేట్ పరం కావడంతో అధిక విక్రయాల కోసం బస్టాండ్ సమీపంలో ఉన్న అన్నపూర్ణ నగర్‌లో షాపు ఏర్పాటుకు యత్నాలు జరుగుతున్నాయి. ఆ ప్రాంతంలో మద్యం దుకాణ ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దంటూ ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్ స్వామికి స్థానికులు వేణుగోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, వెంగళ్‌రెడ్డి, వీరారెడ్డి తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు.

ఆటో ఢీకొని వాహనచోదకుడికి గాయాలు

వెంకటాచలం: ఆటో ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడు గాయపడిన ఘటన మండలంలోని తిక్కవరప్పాడు సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. సర్వేపల్లికి చెందిన వెంకయ్య పని నిమిత్తం బైక్‌పై వెంకటాచలం వైపు బయల్దేరారు. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న ఆటో ఢీకొంది. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడ్ని నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు

- తాత్కాలిక లైసెన్స్‌ల మంజూరు
- శరవేగంగా దుకాణాల ఏర్పాటుకు చర్యలు

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో ప్రైవేట్ మద్యం దుకాణాలు బుధవారం ప్రారంభంకానున్నాయి. జిల్లాలో 182 మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో వ్యాపారులకు కేటాయించారు. దక్కించుకున్న వ్యాపారులు వార్షిక లైసెన్స్ ఫీజులో 1 / 6వ వంతును చెల్లించారు. తాత్కాలిక లైసెన్స్‌లను అధికారులు మంజూరు చేశారు. దుకాణాల ఏర్పాటుకు వ్యాపారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. భవన యజమానులతో కొందరు ఇప్పటికే అగ్రిమెంట్ చేసుకొని ఉండగా, అవసరమైన అన్ని సామగ్రిని సమకూర్చుకుంటున్నారు. భవనాల వేటలో అధిక శాతం మంది ఉన్నారు. తాత్కాలికంగా ఏదో ఒక ప్రాంతంలో ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నారు. మరోవైపు కొందరు వ్యాపారులు జనావాసాల మధ్య దుకాణాలను ఏర్పాటు చేస్తుండటంతో స్థానికులు అడ్డుకుంటున్నారు. తమ ప్రాంతాల్లో దుకాణాలను ఏర్పాటు చేయకుండా చూడాలని స్థానిక ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాలను అందజేస్తున్నారు.

ఖరారు కాని ధరలు

దుకాణాలు బుధవారం ప్రారంభించాల్సి ఉండగా, ఇంత వరకు మద్యం ధరలు ఖరారు కాలేదు. అయినా పాత ధరలకే ఐఎమ్మెల్ డిపో వద్ద వ్యాపారుల నుంచి డిపాజిట్లు కట్టించుకొని అందజేస్తున్నారు. ధరలు ఖరారయ్యాక దీన్ని సవరిస్తామని చెప్పారు.

ఉదయం 10 నుంచి రాత్రి పది వరకు

నూతన పాలసీ మేరకు ప్రార్థన మందిరాలు, విద్యా సంస్థలు, హాస్పిటళ్లకు 100 మీటర్లు.. హైవేకు 500 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయాలి. ఉదయం పది నుంచి రాత్రి పది వరకు విక్రయాలను సాగించాలి. ఎమ్మార్పీకే విక్రయంతో పాటు దుకాణాల వద్ద మద్యసేవనాన్ని అంగీకరించకూడదు. నిబంధనలను ఉల్లంఘిస్తే అధికారులు కేసులు నమోదు చేస్తారు.

శాశ్వతంగా మూత

ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం రాత్రి నుంచి మూతపడ్డాయి. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఐఎమ్మెల్ డిపో మేనేజర్ ఆయేషాబేగం, డీపీఈఓ శ్రీనివాసులునాయుడు తమ సిబ్బందితో కలిసి ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఫిజికల్ వెరిఫికేషన్ చేస్తున్నారు. దుకాణాల్లో ప్రస్తుతం ఎంత మద్యం నిల్వ ఉంది.. విక్రయాలు ఎంత మేర సాగాయి.. ఎంత నగదు ప్రభుత్వ ఖజానాకు జమైంది.. తదితర వివరాలను అక్కడున్న సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకోవడంతో పాటు రికార్డులను పరిశీలిస్తున్నారు. మద్యం నిల్వలు, ఫర్నిచర్, కంప్యూటర్, సామగ్రి తదితరాలను స్వాధీనం చేసుకొని ఐఎమ్మెల్ డిపోకు తరలిస్తున్నారు. ప్రక్రియ రెండు, మూడు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది. ప్రభుత్వ మద్యం దుకాణాలు శాశ్వతంగా మూతపడటంతో అందులో పనిచేస్తున్న ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోలీస్ యంత్రాంగం అప్రమత్తం



పొట్టేపాళెం వద్ద కలుజును కలెక్టర్ ఆనంద్‌తో కలిసి పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

- లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపు

నెల్లూరు (క్రైమ్): తీవ్ర వాయుగుండం ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. మరో 48 గంటల పాటు భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. అగ్నిమాపక, మత్స్య, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ తదితర శాఖల అధికారుల సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు చేపడుతోంది. ఎస్పీ కృష్ణకాంత్ నేతృత్వంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు పోలీస్ అధికారులు సిద్ధంగా ఉన్నారు. లైఫ్ జాకెట్లు, డ్రాగన్ లైట్లు, ఉడ్ కట్టర్లు, రోప్‌లు, ఎమర్జెన్సీ ఇల్యూమినేషన్ లైట్లను అందుబాటులో ఉంచుకున్నారు. పెన్నా పరీవాహక ప్రాంతం, సముద్ర తీర ప్రాంతాలు, డ్యామ్‌లు, చెరువులు, వాగుల వద్ద పోలీస్ పికెట్లను ఏర్పాటు చేస్తున్నారు. మత్స్యకారులను వేటకు వెళ్లొద్దని తీర ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారు. వర్ష ప్రభావం అధికంగా ఉండే లోతట్టు, శివారు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఉలవపాడు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న 350 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. జాతీయ రహదారితో పాటు ఇతర రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు.

అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. అత్యవసర మందులు, నిత్యావసరాలు, పాల ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని, అత్యవసరమైతే మినహా ఇళ్లు విడిచి బయటకు రావొద్దని చెప్పారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే డయల్ 112, 94407 96370, పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబర్ 93929 03413కు సమాచారం అందిస్తే తగిన చర్యలు చేపడతామని వివరించారు. వర్షాలు పూర్తిగా తగ్గేంతవరకు సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని కోరారు. వర్ష ప్రభావం అధికంగా ఉండే ప్రాంతాల్లో విపత్తు తలెత్తితే వెంటనే జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని సూచించారు.

గండిని పరిశీలించిన ఎస్పీ

పాత పెన్నాబ్రిడ్జి బోడిగాడి తోట వద్ద పడిన గండి, పొట్టేపాళెం కలుజును కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఎస్పీ మంగళవారం పరిశీలించారు. వరదలు సంభవిస్తే చేపట్టాల్సిన చర్యలపై పోలీస్ అధికారులతో చర్చించారు.

కృష్ణపట్నం వద్ద ఒడ్డుకు చేరిన కాశిమేడు జాలర్లు

తిరువొత్తియూరు: సముద్రంలో చేపల వేటకెళ్లిన తమిళనాడులోని చెన్నై, కాశిమేడుకు చెందిన 15 జాలర్లు ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణపట్నం వద్ద ఒడ్డుకు చేరుకొని ఆశ్రయం పొందుతున్నారు. వారం రోజుల క్రితం కాశిమేడు ఫిషింగ్ పోర్టు నుంచి చేపలు పట్టేందుకు 15 ఫైబర్ పడవల్లో జాలర్లు సముద్రంలోకి వెళ్లారు. ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో పాటు గాలి వేగానికి వీరందరూ కృష్ణపట్నం ఓడరేవు వద్ద సురక్షితంగా ఒడ్డుకు చేరారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 145	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 284
లేయర్ (లైవ్)	: 120		
బ్రాయిలర్ చికెన్	: 258	లేయర్ చికెన్	: 204

ఏడేళ్లయినా పిల్లలు పుట్టలేదని..

- వేరే పెళ్లికి భర్త సిద్ధమయ్యారు
- పోలీసులకు వివాహిత ఫిర్యాదు



విలేకరులతో మాట్లాడుతున్న అర్చన

వింజమూరు: పెళ్లయి ఏడేళ్లవుతున్నా తనకు పిల్లలు పుట్టలేదని తన భర్త వేరే పెళ్లి చేసుకుంటున్నారని విడవలూరు గిరిజన కాలనీకి చెందిన అర్చన వాపోయారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద విలేకరులతో మంగళవారం ఆమె మాట్లాడారు. ఊటుకూరులోని శంకర్ నగర్ కాలనీకి చెందిన ఇండ్ల గణేష్‌తో తనకు ఏడేళ్ల క్రితం వివాహమైందని, అయితే తనకు పిల్లలు పుట్టలేదంటూ నిత్యం మద్యం తాగొచ్చి మానసికంగా, శారీరకంగా వేధించేవారని తెలిపారు. ఇప్పుడు తనను కాదని వేరొకర్ని పెళ్లి చేసుకుంటున్నారని తెలియడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని తెలిపారు. జిల్లా అధికారుల తనకు న్యాయం చేయాలని కోరారు.

యువతిని మోసగించిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు

ఆత్మకూరు: తనను ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. వంచించి.. చివరికి మరో పెళ్లికి సిద్ధమైన యువకుడిపై ఓ యువతి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీంతో ఆ యువకుడిపై అట్రాసిటీ కేసుతో పాటు పలు సెక్షన్లతో కేసు నమోదు చేశామని ఎస్సై జిలానీ తెలిపారు.

పట్టణంలోని మెయిన్ బజార్‌లో గల ఓ హోల్‌సేల్ దుకాణంలో స్థానిక దళితవాడకు చెందిన యువతి పనిచేస్తున్నారు. అదే దుకాణంలో మహమ్మద్ హుస్సేన్ పనిచేస్తున్నారు. ఏడాదిన్నర కాలంగా వీరి మధ్య పరిచయం ప్రేమకు దారితీసింది. పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఆమెను లోబర్చుకున్నారు. తల్లిదండ్రులు కుదిర్చిన అమ్మాయితో ఈ నెల 21న వివాహానికి సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.